ఏఆర్ యాప్, 3-డీ ఈ బుక్స్ ఆవిష్కరణ



ఏఆర్ యాప్, 3డీ ఈ-బుక్స్ ఆవిష్కరిస్తున్న నిశ్చల్ నారాయణం

సనత్‌నగర్: భారత యంగెస్ట్ చార్టెడ్ అకౌంటెంట్, వరల్డ్స్ యంగెస్ట్ డబుల్ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత నిశ్చల్ నారాయణం మరోసారి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. గతంలో అందుబాటులోకి తీసుకువచ్చిన పోర్టబుల్ ల్యాబ్‌ల కాన్సెప్ట్‌ను దేశవ్యాప్తంగా 5,000 పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. అదే తరహాలో గత ఐదేళ్లుగా పరిశోధించి రూపొందించిన ఏఐ ఆధారిత ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ) యాప్‌తో పాటు వీఆర్ ఆధారిత 3డీ ఈ-బుక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మేరకు మంగళవారం బేగంపేటలోని నిశ్చల్ స్మార్ట్ లెర్నింగ్ సొల్యూషన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీఆర్ యాప్, 3డీ ఈ-బుక్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం ఏఆర్ యాప్, 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం 3డీ ఈ-బుక్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నిశ్చల్ లెన్స్ విద్యార్థులు ఏదైనా పాఠ్య పుస్తకాన్ని ఎక్కడైనా స్కాన్ చేసి అందులోని అంశాలను 3డీ యానిమేషన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం తదితర సబ్జెక్టుల కోసం రూపొందించిన యాప్ 35,000 పైగా వీడియోలు, 28,000లకు పైగా యానిమేషన్లు, సిమ్యులేషన్లతో ఉంటుందన్నారు. విద్యార్థుల వయస్సుకు తగిన పరిజ్ఞానాన్ని అందించేలా ఆలోచనాత్మకంగా రూపొందించినట్లు తెలిపారు. ప్రపంచంలోనే మొదటి వీఆర్ ఆధారిత 3డీ ఈ-బుక్స్ ద్వారా వెయ్యికి పైగా సిమ్యులేషన్లు, 150 గంటల పైగా 3డీ యానిమేటెడ్ వీడియోలు, 100కి పైగా ఐక్యూ గేమ్స్‌తో పాటు గణితం, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భూగోళ శాస్త్రం వంటి ముఖ్యమైన అంశాలను పొందుపరిచినట్లు వివరించారు. ఇవి విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

చిలకలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఆరు గ్యారంటీల అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. క్యాంప్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లి నమూనాలో బతుకమ్మ లేకపోవడం దారుణమన్నారు. ఎవరి రూపాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించారో వివరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లపై పోలీసుల దాడి అమానుషమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శైలేందర్, జకీర్, కరీంలాలా, లక్ష్మీ, విజయ, జ్యోతి, లలిత, సరోజిని, ప్రవళ్లిక, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం తగదు



తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రసూల్‌పురా: ఉద్యమ సమయంలో తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం దారుణమని బీఆర్ఎస్ నేతలు అన్నారు. విగ్రహ మార్పును నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గజ్జల నాగేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అధికార పండుగ బతుకమ్మను తెలంగాణ తల్లి విగ్రహం నుంచి వేరు చేసి ఆడపడుచులను అవమానపరిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విగ్రహం తెలంగాణ తల్లి విగ్రహం కాదని కాంగ్రెస్ తల్లి విగ్రహమని ఆరోపించారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఉద్యమకారులు జంగిలి రాజు, సాయి కిరణ్, కనకయ్య. శర్విణ్ జంగాల మురళి యాదవ్, కిరణ్, దేవుల పల్లి శ్రీనివాస్, పనస సంతోష్, కుమార్ ముదిరాజ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో తుర్కిమెనిస్తాన్ బృందం పర్యటన



తుర్కిమెనిస్థాన్ బృందంతో ఓయూ వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూను తుర్కిమెనిస్థాన్ దేశానికి చెందిన అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా తుర్కిమెనిస్థాన్ రాయబారి కాన్సుల్ షముహమ్మత్ మహ్మద్దోవ్ నేతృత్వంలోని బృందం సభ్యులు ఓయూ వీసీ ప్రొ.కుమార్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఓయూలో కోర్సులు, ఫీజుల వివరాలు, విదేశీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, హాస్టల్ ఇతర వసతులు, బోధన, పరిశోధనలు, పరీక్షలు, ఫలితాలు తదితర అంశాలను వీసీ వారికి వివరించారు. ప్రస్తుతం ఓయూలో 46 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని మీ దేశానికి చెందిన విద్యార్థులను పంపిస్తే వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ అధికారులు పాల్గొన్నారు.

12న దగాపడ్డ కళాకారుల డప్పుల మోత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 12,13 తేదీల్లో 32 గంటల పాటు దగాపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కవి, గాయకుడు నేర్నాల కిశోర్ తెలిపారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దగాపడిన కళాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని కోరుతూ 32 గంటల పాటు డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు వలిగొండ నరసింహ, జంగిలి దర్శన్, బోరెల్లి సురేష్, శాంగటి రాజేష్, గణేష్, వేముల సురేష్ యాదవ్, శంకర్‌యాదవ్, ప్రవీణ్‌నాయక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జనహిత షెల్టర్‌హోమ్ సేవలు అభినందనీయం



జనహిత షెల్టర్‌హోమ్‌లో అన్నదానం చేస్తున్న సేవాభారతి ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని జనహిత షెల్టర్‌హోమ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సేవాభారతి సంస్థ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్ పురానిక్ అన్నారు. మధ్యప్రదేశ్‌కు నుంచి వచ్చిన ఆయన తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శి వాసుతో కలిసి మంగళవారం జనహిత షెల్టర్‌హోమ్‌ను సందర్శించారు. నిరుపేద రోగులు, రోగి సహాయకులకు అందిస్తున్న సేవలను జనహిత మేనేజింగ్ ట్రస్టీ నర్సింహామూర్తి, మేనేజర్ నందకుమార్ వారికి వివరించారు. తెలంగాణ జిల్లాలతోపాటు నగరం నలుమూలల నుంచి వేలాది మంది నిరుపేద రోగులు గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారని, షెల్టర్‌హోమ్‌లో అల్పాహారం, రెండుపూటల భోజనం ఇతర వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రుల ఓపీ విభాగాల్లో హెల్ప్‌డెస్క్‌లు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అడ్డంకులు తొలగుతున్నాయ్..

ప్రమాదాల నివారణకు కసరత్తు

- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు
- ఫలిస్తున్న మున్సిపల్, పోలీసుల సమన్వయం
- మెట్టుగూడ- తార్నాక మార్గంలో ప్రత్యేక కార్యాచరణ



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ – తార్నాక రహదారిని ప్రమాద రహిత రహదారిగా తీర్చేందుకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో నెల రోజుల్లో ఈ రహదారి గుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు, పాదచారులకు మార్గం సుగమం చేసేందుకు ఇరు విభాగాల అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. పదేళ్లుగా ఈ రహదారి ట్రాఫిక్ సమస్యలకు, ప్రమాదాలకు నిలయంగా ఉంది. రహదారి ఇరుగ్గా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడటమేగాక, ప్రమాదాలు జరిగేవి. మెట్రో కారిడార్ల నిర్మాణం సందర్భంగా అవసరమైనంత మేర రహదారి విస్తరణ జరిగినా మళ్లీ అవే సమస్యలు పునరావృతమవుతున్నాయి. సికింద్రాబాద్ సంగీత్ సర్కిల్ నుంచి హబ్సిగూడ చౌరస్తా వరకు ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తోంది. అడపా దడపా ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రణాళికాబద్ధంగా చర్యలు..

సమస్యాత్మకంగా మారిన ఈ రహదారిలో వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు రూపొందించిన సంయుక్త కార్యాచరణ లోని అంశాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ నేతృత్వంలో ఉత్తర, పశ్చిమ మండలాల ట్రాఫిక్ పోలీస్ అధికారులు బృందంగా ఏర్పడి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేశారు. సంగీత్, చిలకలగూడ, ఆలుగడ్డబావి, మెట్టుగూడ, తార్నాక, హబ్సిగూడ కూడళ్లలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు

ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధానంగా సికింద్రాబాద్- మెట్టుగూడ - తార్నాకతో పాటు ఒలిఫెంటా చౌరస్తా, చిలకలగూడ కూడలి మీదుగా ప్రయాణించే అన్ని వాహనాల రాకపోకలపై దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న తార్నాక – మెట్టుగూడ,-సికింద్రాబాద్ రోడ్డు మార్గంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు లేజర్ గన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మెట్టుగూడ మార్గంలో గన్‌లను ఏర్పాటు చేసిన పోలీసులు ఈ రోడ్డు ఆసాంతం ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దీని ద్వారా వాహనాల వేగాన్ని పర్యవేక్షించడం, పరిమితిని మించిన వాహనాలకు చలాన్లు జారీ చేయడం వంటి చర్యలు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా ఆటోల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించడం, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు తీసుకుంటున్నట్టు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు.

తుది దశలో జీహెచ్ఎంసీ పనులు

జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన సంయుక్త కార్యాచరణ లో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికే ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. మూసివేసిన తార్నాక జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలను పునరుద్ధరించే చర్యలు తుది దశకు చేరాయి. సాంకేతిక సమస్యలు అధిగమించి తార్నాక జంక్షన్‌ను ఓపెన్ చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అనంతరం సిగ్నల్స్ వద్ద జీబ్రా లైన్స్, బస్‌బే ల ఏర్పాటు, పాదచారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీఎస్ పేర్రాజు తెలిపారు.

శుభాకాంక్షలు



ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌తో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతలు

రసూల్‌పురా: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రొ. కాసీంను మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు అజిత్ వాల్మీకి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొంపల్లి విజయ్ మాదిగ, రామరపు శ్రీనివాస్, పల్లేర్ల సుధాకర్, మందరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పురోగతిలో మానవ హక్కుల పాత్ర కీలకం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పురోగతిలో మానవ హక్కుల పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో లా స్టూడెంట్స్ ఫోరం ఫర్ రిపబ్లిక్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయ శాస్త్ర విద్యార్థి రవితేజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ మానవ హక్కుల కోసం న్యాయ శాస్త్ర విద్యార్థులు, న్యాయవాదులు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది షకీల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ రీసెర్చ్ స్కాలర్ అన్వేష్ బాకీ, ఓయూ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో రెండో రోజు అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా కొనసాగాయి. ఈ నెల 9 తేదీ నుంచి 11 వరకు అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి పంచలోహ విగ్రహానికి 81 కళశాలు, 81 ద్రవ్యాలతో మహాస్నపనం, నవ చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ నెల 11న ఉదయం 8గంటలకు నిర్వహించనున్న ముత్యాలమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, దేవదాయ శాఖ కమిషనర్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లోని శ్రీ కాలభైరవ ఆలయ బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. డిసెంబర్ 22 నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల ఆహ్వానపత్రాన్ని మంత్రికి అందజేశారు. అర్చకులు కన్నయ్య, కమిటీ సభ్యులు కంచమీది శివయ్య, లక్ష్మణ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్న

అడ్డగుట్ట: తుకారాంగేట్ రోడ్ అండర్ బ్రిడ్జ్(ఆర్‌యూబీ) వద్ద జరుగుతున్న పెయింటింగ్ పనులను స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి జీహెచ్ఎంసీ అధికారులతో మంగళవారం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా పలు కూడళ్లు, బ్రిడ్జిల వద్ద సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. అందులో భాగంగా తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద వేసిన పెయింటింగ్‌లు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ తివారీ, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, సత్తయ్య, దాసరి శ్రీను, వసంత, ఎల్లయ్య, అమర్, శ్రీరామ్, దేవయ్య, రామప్ప, శంకర్, సుధాకర్, సత్యనారాయణ, రమా, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో అమీర్‌పేట తహసీల్దార్ తదితరులు

అమీర్‌పేట: సీఎం కప్ – 2024 అమీర్‌పేట మండలస్థాయి ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రెవెన్యూ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమీర్‌పేట గురుగోవింద్‌సింగ్ మున్సిపల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరుగనున్న పోటీలను అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గెలుపొందిన జట్లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రెండో రోజు పోటీలు సనత్‌నగర్ డివిజన్ అశోక్‌కాలనీ మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి యాదయ్య, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాలకృష్ణ, కోచ్‌లు హేమలత, ప్రవీణ్, అష్రఫ్, అరుణ్ పాల్గొన్నారు.

బీరప్ప పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం పలువురు మేధావులు బీరప్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగులో డాక్టర్.బి నాగేశ్వర రచించిన ఈ పుస్తకాన్ని రచయిత సుభాష్ మంత్రి కుర్మ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. తెలంగాణ షఫర్డ్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ రూం నెంబర్ 121లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.కాశీం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రొ.కంచ ఐలయ్య, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ప్రొ.రాములు, ఇంగ్లిష్ అనువాదకులు సుభాష్ మంత్రి కుర్మ, ఒగ్గు రవి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై నిరంతర పర్యవేక్షణ



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పీస్ కమిటీ సభ్యులు, పోలీసులు

అమీర్‌పేట: ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, చర్చీల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పు పర్యవేక్షించాలని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మహబూబ్, హనుమంత్‌రావు, భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రార్థనా మందిరాలు, ఆలయాలు, గురుద్వారా ప్రాంతంలో పోలీసులతో కలిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న ఆలయాల వద్ద కాపలాదారులు లేక పోగా, సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదన్నారు. అన్ని ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి

ఆరుగురి అరెస్ట్

అమీర్‌పేట: అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతుండటంతో ఇళ్లకు వెళ్లాలని చెప్పిన మహిళా ఎస్సైని దుర్భాషలాడి, వారిని అక్కడి నుంచి పంపించేందుకు యత్నించిన కానిస్టేబుల్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి ఎస్ఆర్‌నగర్ మహిళా ఎస్సై అఖిల సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహిస్తున్నారు. బల్కంపేట, అమీర్‌పేట రోడ్డులోని విష్ణుఫైర్ వర్క్స్ వద్ద గుమిగూడిన ఆరుగురు వ్యక్తులను గుర్తించిన ఆమె వారిని అక్కడి నుంచి వెళ్లి పోవాలని సూచించారు. వారు పట్టించుకోకపోగా దుర్భాషలాడుతూ చార్మినార్‌కు వస్తే తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. దీంతో వారిని అక్కడి నుంచి పంపించేందుకు యత్నించిన కానిస్టేబుల్ మోహన్‌రావుపై ఒకరు దాడి చేశాడు. అప్రమత్తమైన పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని వెంకటేష్, మల్లేష్, శంకర్‌రెడ్డి, సాయికృష్ణ, కిరణ్‌కుమార్, శివప్రసాద్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 27, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 31, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 23, గుండుబీన్స్ 38, గింజ చిక్కుడు 35, గోకరకాయ 33, కీర 19, దోసకాయ 18, బీట్‌రూట్ 43, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: ప్రపంచం మొత్తం జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లి కార్యాలయంలో ఎస్ఆర్‌నగర్‌లోని క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. చర్చి కో పాస్టర్ జాయ్ సీమన్ పీటర్, ప్రతినిధులు పాల్ బసవయ్య, జాకీర్ హుస్సేన్, జాకోబ్, షీబాపాల్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, నర్సింహ, అశోక్ యాదవ్, కట్టు బల్‌రాం పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చర్లపల్లి – ఘట్కేసర్ రైల్వే సేషన్ల మధ్యలో మంగళవారం ఉదయం 40–45 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి చేతిపై 'మహంకాళి' అని హిందీలో రాసి ఉందన్నారు. బూడిద కలర్ షర్ట్, క్రీమ్‌కలర్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అబ్దుల్ జోసెఫ్ (ఫైల్)

బౌద్ధనగర్: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్, బాప్టిస్ట్ చర్చి ప్రాంతంలో నివాసముంటున్న అబ్దుల్ జోసెఫ్ హిరామ్ షేక్(ప్రైవేటు ఉద్యోగి. మూడు నెలల క్రితం ఉద్యోగానికి వెళ్తున్నట్లు చెప్పి బయటికి వెళ్లిన జోసెఫ్ తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అతని భార్య సంగీత వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సాయికుమార్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: శుభకార్యానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన షాద్‌నగర్ ఠాణా పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం, తిమ్మాపల్లి గ్రామానికి చెందిన మరికంటి సాయికుమార్, భార్గవి దంపతులు నగరంలోని బేగంపేట పరిధి ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సాయికుమార్ బైక్‌మెకానిక్‌గా పనిచేసేవాడు. ఈ నెల 6న వారు వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, కాళ్లాపూర్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. 7న హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలో షాద్‌నగర్‌లో ఉంటున్న బంధువు వెంకటేశ్‌తో ప్లాట్ విషయం మాట్లాడి వస్తానని భార్యను హైదరాబాద్‌కు వెళ్లమన్నాడు. దీంతో భార్గవి ప్రకాశ్‌నగర్‌కు వెళ్లిపోయింది. సాయికుమార్ ఇంటికి రాకపోవడంతో ఆమె తిమ్మాపల్లికి ఫోన్ చేసింది. అక్కడికి రాలేదని చెప్పడంతో బంధువులతో పాటు వెంకటేశ్‌ను అడిగినా అతడి ఆచూకీ లభించలేదు. భార్గవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన యూజీడీ పనులు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ సూర్యానగర్ కాలనీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నత్తనడకన సాగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని రహదారులు మట్టితో నిండిపోవడం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, బీఆర్ఎస్ నేత మేకల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కనీసం ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా మట్టి నిండి ఉందని, అధికారులు చొరవ తీసుకుని పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.